క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసిన వైద్యాధికారి



రికార్డులు పరిశీలిస్తున్న అంజిత్‌రెడ్డి

మెట్‌పల్లి: పట్టణంలోని సురక్ష, లక్ష్మీనివాస్ ఆస్పత్రుల్లో బుధవారం మండల వైద్యాధికారి ఎలాల అంజిరెడ్డి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాటిల్లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రుల్లో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. రోగుల వివరాలను ప్రతి రోజు జిల్లా అధికారులకు అందించాలని సూచించారు. అలాగే ఫీజుల వివరాలను బోర్డుపై ప్రదర్శించడంతో పాటు ఇతర నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట హెచ్ఈవో రమేశ్, హెల్త్ సూపర్‌వైజర్ అచ్యుతరావు ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా స్థాయి పాఠశాలల క్రీడలకు అంతర్గాం పాఠశాలకు చెందిన క్రీడాకారులు పూజ, కీర్తన, ఇందు, అశ్విని, వైశాలి, శరణ్య, కీర్తన, స్వాతి, దీపిక, హర్షవర్ధన్, మనోజ్, శ్రీ హర్ష, తిరుమలేష్, స్వామి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు, పీఈటీ కోటేశ్వరరావు అభినందించారు.

అల్లీపూర్ విద్యార్థులు..

రాయికల్: మండలంలోని అల్లీపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన శేషప్రియ, షర్మిల, చైత్ర, నితీశ, సంజన, మాధురి, వర్షవర్ధిని, మనోజ్, విశ్వేష్ అనే విద్యార్థులు వాలీబాల్‌లో గోవర్ధన్, రిశ్వంత్, కబడ్డీలో కుమార్, అథ్లెటిక్స్‌లో అనుష, శిరీష, శ్రీనిధి, శేషిప్రియ, మనోజ్‌లు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పీడీ కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నెల 24నుంచి 28వరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు.

ఓపెన్ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని వినతి



కలెక్టరేట్ వద్ద వెల్లుల్ల గ్రామ రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర చెల్లించాలంటూ జిల్లా కలెక్టర్‌కు వెల్లుల్ల గ్రామ రైతులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులో ఎన్‌హెచ్ 63 జాతీయ రహదారి వెళ్తుందని, దీనికి అదనంగా బైపాస్‌రోడ్ నిర్మించేందుకు రైతుల భూములు తీసుకున్నారని, ఆ భూములకు ప్రభుత్వ రేటు కాకుండా ఓపెన్ మార్కెట్‌లో ఉన్న రేటు ప్రకారం ధర చెల్లించాలని కోరారు. లేదంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది 2–3 పంటలు సాగుచేసే భూముల నుంచి రోడ్ వెళ్తున్నందున అదనపు పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ మారు మురళీధర్‌రెడ్డి, రైతులు నీలి గంగారెడ్డి, రాజిరెడ్డి, సాయిరెడ్డి, రాజ గంగారాం, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భోగ శ్రావణిని దూషించిన వారిపై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ వద్ద బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: గణేశ్ శోభాయాత్రలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణిని అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. హిందుత్వ ముసుగులో ఆడబిడ్డపై అసభ్య పదజాలంతో దూషణకు పాల్పడిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, కవిత, మధురిమ, గడ్డల లక్ష్మి, మ్యాకల లక్ష్మి రూరల్ నలువాల తిరుపతి,నాయకులు పాల్గొన్నారు.

పేదల కోసమే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్: పేదలను ఆదుకోవడం కోసమే ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో,మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులను కలిసి చెక్కులను అందజేశారు. ఆడపిల్లల పెళ్లికి పేద కుటుంబాలు ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఈ రెండు పథకాలతో ఇప్పటి వరకు నియోజకవర్గంలో వేలాది కుటుంబాలకు లబ్ధి కలిగిందన్నారు. ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మారుతి, తిరుపతిరెడ్డి,రాజాగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ సాదాసీదాగానే..



మెట్‌పల్లి: విలాసవంతమైన భవనాలు, ఖరీదైన కార్లల్లో గడిపే ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నియోజకవర్గ పర్యటనలో మాత్రం సాదాసీదాగానే వ్యవహరిస్తున్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆయన..ఉదయం స్థానిక చైతన్యనగర్‌లోని ఓ చిన్న హోటల్ వద్ద మెట్లపై కూర్చొని కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేశారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



పాఠశాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతోపాటు మీ వెంటే ఉంటానని, ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలంటూ, విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. మండలంలోని తక్కళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కోయిల లక్ష్మీ పాఠశాల భవనం మరమ్మతులు చేపట్టాలని కోరారు. పాఠశాల భవనం మరమ్మతు చేపట్టడంతోపాటు, విద్యార్థులకు ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం లింగాల శంకరయ్య, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కోయిల లక్ష్మి, దారం ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్లాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గెస్ట్ పీజీటీ, టీజీటీ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భూమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు జంతుశాస్త్రం బోధించుటకు పీజీటీ విభాగంలో తెలుగు–1, ఇంగ్లిష్–2, మ్యాథ్స్–2, ఎకనామిక్స్–1, కామర్స్–1, బోటనీ–1, టీజీటీ విభాగంలో సోషల్–1లతో మొత్తం 9 పోస్టులకై తాత్కాలిక ప్రతిపాదికన (హావర్లీ బేస్‌డ్) పనిచేయుటకు ఆసక్తి గల నిరుద్యోగులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ 9948752514 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన సుజీత్‌రావు



మెట్‌పల్లి: పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్‌రావు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రవాసీ ప్రజావాణిని ఏర్పాటు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గం నుంచి వేలాది మంది గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చాలా మందికి ఎంతో ప్రయోజనం కలుగుతోందని సీఎంకు వివరించినట్లు ఆయన పేర్కొన్నారు.

ధర్మపురిలో ముగిసిన భాగవత సప్తాహం



బ్రహ్మశ్రీకి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు

ధర్మపురి: వారం రోజుల నుంచి ధర్మపురిలో జరుగుతున్న భాగవత సప్తాహం బుధవారం నాటితో ముగిసింది. శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోఈనెల 10 న భాగవత సప్తాహ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ముగింపు సందర్భంగా బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మకు దేవస్థానం పక్షాన ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం కప్పి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు, మహిళా మండలి సభ్యులు, దేవస్థానం అర్చక బృందం, భక్తులు తదితరులున్నారు.

భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెగడపల్లి:మండల కేంద్రంలోని భక్త మార్కండేయ స్వాయి ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పద్మశాలీ కులబాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈనెల 20న జరిగే కేబినేట్ సమావేశంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేలా చూడాలని, దసరా ముందు డీఏలు, పీఆర్సీ, పెండింగ్ సమస్యలపై పరిష్కరించేలా చూడాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా సభ్యత్వ నమోదు

కోరుట్ల: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలో సభ్యత్వ నమోదుపై బుధవారం స్థానిక నాయకులతో చర్చించారు. బూత్ అధ్యక్షులు, జిల్లా నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి పీసరి నర్సయ్య,జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదవేణి మహేశ్, కౌన్సిలర్ మాడవేణి నరేశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏ విధంగా భోజనాలు వడ్డిస్తున్నారు, నాణ్యతతో రుచికరంగా ఉన్నాయా లేదా పరిశీలించారు. విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలని ఎజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, పంచాయతి కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, మానవ హారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో కోమటికొండాపూర్ పాఠశాల హెచ్ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్న ప్రాసన

కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అన్న ప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అగ్గితెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: పొలాలకు సోకుతున్న అగ్గి తెగులు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని ఏవో రాజ్ కుమార్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో అగ్గి తెగులు సోకిన పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన రైతులు, ఏఈవోలు ఉన్నారు.

విద్యార్థులను కళాశాలకు పంపించాలి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఎర్దండి గ్రామానికి చెందిన విద్యార్థులు కళాశాలకు గైర్హాజరు అవుతుండడంతో బుధవారం అధ్యాపకులు రతన్‌సింగ్, ప్రేమ్‌కుమార్ విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు లేఖలను అందచేశారు. విద్యార్థులను కళాశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కథలాపూర్: ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మండలంలోని ఊట్‌పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డిని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 16 పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అర్జున్, వేణుగోపాల్, పరమేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి

మల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జగదీష్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌లో ఆయన పర్యాటించి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలలో భాగంగా పాఠశాల విద్యార్థులతో ఆయన మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

బుగ్గారం: మండలంలోని వివిధ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ క్రింద మంజూరైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పంపిణీ చేశారు కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్,నాయకులు కొడిమ్యాల రాజన్న,పెద్దనవేణి శంకర్ పాల్గొన్నారు.

కలప పట్టివేత

ఇబ్రహీంపట్నం : మండలంలోని వేములకుర్తి గ్రామంలో కలపను పట్టుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ బుధవారం తెలిపారు. వేములకుర్తి అడవిలో బుర్ర అంజయ్య అనే వ్యక్తి రూ. 50వేలు విలువ గల 4 టేకుచెట్లను కొట్టివేసి, తరలించేందుకు సిద్ధంగా ఉండటంతో సమాచారం తెలుసుకొని టేకు దొంగలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఆరోగ్య రక్షణే లక్ష్యంగా పోషణ మాసం ఉత్సవాలు

మల్లాపూర్/ పెగడపల్లి: ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తోందని ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీష్ ఐకేపీ ఏపీఎం దేవరాజ్, సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర, శంకరమ్మ, పంచాయతీ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఎత్తివేతపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ రైతు పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేయడంపై అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)రాంబాబు,డీసీవోకు ఆ సంఘ సభ్యులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రాజారెడ్డి,గంగారెడ్డి,లింగారెడ్డి,తిరుపతిరెడ్డి,రాజ్‌పాల్‌రెడి పాల్గొన్నారు.

3వ విడత సామాజిక తనిఖీ వేదిక

జగిత్యాలరూరల్: మండలంలోని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో 29 గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించన్నుట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. తుది నివేదికను ఈనెల 20 మండల పరిషత్‌లో ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు.

నిమజ్జనం పూర్తి

జగిత్యాలరూరల్/ధర్మపురి: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, చల్‌గల్, అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామాల్లో, ధర్మపురి పట్టణంలో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథులను భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, వాగుల్లో గోదావరిలో నిమజ్జనం చేశారు.

ప్రజల సహకారంతోనే ప్రశాంతంగా నిమజ్జనం

మెట్‌పల్లి: మండపాల నిర్వాహకులతో పాటు అన్ని వర్గాల ప్రజల సహకారంతో సర్కిల్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డి, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలన్నారు.

రెండు ఆటోలు ఢీకొని ఐదుగురికి గాయాలు

జగిత్యాలక్రైం: రెండు ఆటోలు ఢీకొని ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ మండలం రఘురాములకోట గ్రామ శివారులో బుధవారం సాయంత్రం రెండు ఆటోలు ఒకదానికి ఒకటి ఢీకొనడంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'పెగడపల్లి సొసైటీపై కక్షసాధింపు రాజకీయాలు'

పెగడపల్లి: పెగడపల్లి సహకార సంఘం అభివృద్ధిని ఓర్వలేక సంఘంలో చేపట్టిన అభివృద్ధి కార్యకలాపాలపై అధికార పక్ష నాయకుల ఒత్తిడికి జిల్లా సహకార సంఘ అధికారులు తలొగ్గి సుమోటో కింద విచారణ చేపట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు పెగడపల్లి సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు అన్నారు. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో బుధవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సొసైటీపై కోఆపరేటివ్ రిజిస్ట్రార్ విచారణకు ఆదేశించడం రాజీకయ కక్షసాధింపు చర్యలే తప్ప వేరొకటి లేదన్నారు. సమావేశంలో సీ ఈవో గోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు సుధీర్, శ్రీనివాస్, మల్లేశం, గోపాల్‌రావు, హరి లానాయక్, సుమలత, ఎల్లయ్య, సత్తిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జగిత్యాల: మెట్‌పల్లిలోని శ్రీరాంనగర్ కాలనీలో నాలుగో వార్డులో కుక్కల బెడద అధికంగా ఉంది. అక్కడ అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో పిల్లలపై దాడులు చేస్తున్నాయని, బెడద తప్పించేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి, కాలనీలో మహిళలు బయట తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
మోహన్, మెట్‌పల్లి బల్దియా కమిషనర్ సెల్ నం: 9866577636

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

మేదరుల సమస్యలు పరిష్కరించాలి



రాయికల్‌లో ర్యాలీ తీస్తున్న మేదరులు

ధర్మపురి: మేదరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మహేంద్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేర్ల రాజేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ వెదురు (బొంగులు) దినోత్సవం సందర్భంగా బుధవారం పలు గ్రామాల నుంచి మేదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్మపురిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిలువేరి రాజయ్య, ప్రధాన కార్యదర్శి మామిడిపెల్లి గోపాల్, మండల అధ్యక్షుడు పోశమల్లు, తదితరులు పాల్గొన్నారు.

మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

రాయికల్: మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మేదరులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా రాయికల్‌లో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మ్యాదరులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుని మేదరి ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షులు సిలివేరి సురేష్, నాయకులు కనికారపు లక్ష్మణ్, ఇందూరి గంగాధర్, లక్ష్మీనర్సయ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆదిశ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమారం మండల కేంద్రంలో భారతి బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 20 యూనిట్లు రక్తదానం చేశారు. వల్లంపల్లిలో మాజీ సర్పంచ్ వెల్మ సమత–నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాలోని వాల్మీకి అనాథ ఆశ్రమ పిల్లలకు అన్నదానం చేశారు. పోరుమల్లలో మాదం వినోద్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు బహుకరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలకేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు అల్లూరి దేవారెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ప్రభాకర్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఇల్లెందుల ప్రభాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకముందు పనిచేసిన నవీన్ జూలపల్లికి బదిలీపై వెళ్లారు. మోడల్‌స్కూల్‌లో ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా 17 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు.

మల్లాపూర్ ప్రిన్సిపాల్‌గా భూమేశ్

మల్లాపూర్: మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా భూమేశ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎం.డీ.అలీమొద్దీన్ బదిలీలో ఆదిలాబాద్ జిల్లా జైనత్ మోడల్ స్కూల్‌కి వెళ్లగా, ఆదే జిల్లాలోని గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో పనిచేసిన భూమేష్ బదిలీపై మల్లాపూర్‌కు వచ్చారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన భూమేశ్‌ను మోడల్ స్కూల్ పీజీటీలు, టీజీటీలు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా హేమంత్

జగిత్యాల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల పట్టణ శాఖ కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా సుధీర్‌కుమార్, మహిళ ప్రతినిధిగా ఒడ్నాల రజిత ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికపై ప్రస్తుత అధ్యక్షుడు సురేశ్‌కుమార్, కార్యదర్శి అజయ్‌కుమార్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా విషయంపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు. వివిధ పార్టీలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సారంగాపూర్: వివిధ రాజకీయ పార్టీలతో నేడు మండలపరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. గ్రామపంచాయతీ ఓటరు జాబితాలో వార్డుల వారిగా ఏమైన అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని, ఇందుకు వివిధ పార్టీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

మల్యాల: మండలంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఓటరు జాబితాలో అభ్యంతరాలపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామని, సమావేశానికి హాజరై, తమ అభిప్రాయ్యాలు తెలపాలని ఎంపీడీవో కోరారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం తెలిపారు.

బుగ్గారం: రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను అనుసరించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు బుగ్గారం ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఓటరు జాబితా విషయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు.